బాణసంచా దుకాణదారులు

నిబంధనలు పాటించాలి

ముషీరాబాద్ అగ్నిమాపక శాఖ ఇన్‌స్పెక్టర్ సురేందర్

ఇంటర్వ్యూ...



రాంనగర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): దీపావళి అంటే బాణసంచా ముఖ్యం. అయితే అజాగ్రత్తగా ఉంటే ప్రమాదాలు చోటుచేసుకుంటాయి. ఈ నేపథ్యంలో బాణాసంచా దుకాణదారులు అగ్నిమాపక శాఖ జారీ చేసిన నిబంధనలు పాటించి అగ్నిప్రమాదాలు జరుగకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ముషీరాబాద్ అగ్నిమాపక శాఖ ఇన్‌స్పెక్టర్ బి.సురేందర్ తెలిపారు. అనుమతి తీసుకోకుండా బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి'తో పలు విషయాలు చర్చించారు.

ముషీరాబాద్ అగ్నిమాపక పీఎస్ పరిధిలో ఎన్ని దుకాణాలకు అనుమతులు ఇచ్చారు?

మా పోలీస్‌స్టేషన్ పరిధిలోకి చిక్కడపల్లి, దోమలగూడ, నారాయణగూడ, గాంధీనగర్, ముషీరాబాద్, చిలకలగూడ, వారాసిగూడ పీఎస్ పరిధిలోని ప్రాంతాలు వస్తాయి. మా పీఎస్ పరిధిలో బాణసంచా విక్రయించేందుకు 120 దరఖాస్తులు రాగా 110 దుకాణాలకు అనుమతి ఇచ్చాం. 10 రిజెక్ట్ చేశాం. ఈ దుకాణాలు ఘంటసాల ప్లే గ్రౌండ్, ముషీరాబాద్ పార్కు, ఆజామాబాద్‌లోని లక్ష్మీకం పెనీ స్థలంలో ఏర్పాటు చేసేందుకు అనుమతులు ఇచ్చాం.

దుకాణదారులు పాటించాల్సిన జాగ్రత్తలు ఏమిటి?

వ్యాపారులు తమ దుకాణాల వద్ద రెండు డ్రమ్ముల నీరు, ఇసుక, అగ్నిని ఆర్పే రెండు అగ్నిమాపక పరికరాలు, లూజ్ వైరింగ్ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. దుకాణాల్లో చిన్నారులకు పెట్టి బాణసంచా విక్రయించొద్దు. క్యూలైన్లు ఏర్పాటు చేయాలి. షాపునకు షాపునకు మధ్య మూడు మీటర్ల దూరం ఉండాలి.

అనుమతులు లేని షాపులపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

అనుమతులు లేకుండా బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేసినా, అక్రమంగా నిల్వ చేసినా కేసులు పెడతాం. ఇలాంటి వాటిపై ప్రత్యేక నిఘా పెట్టి చర్యలు చేపడతాం. ఎవరైనా నిబంధనలు పాటించకుంటే ప్రజలు తమకు సమాచారం ఇవ్వాలి.

బాణసంచా కాల్చేటప్పుడు ఏయే జాగ్రత్తలు తీసుకోవాలి?

చిన్నారులు బాణాసంచా కాల్చే సమయంలో తల్లిదండ్రులు పక్కనే ఉండి వారిచే కాల్పించాలి. బాంబులను చేతి వాడకుండా పొడవాటి స్టిక్‌తో అంటించాలి. రాకెట్లు కాల్చే సమయంలో అవి నిటారుగా వెళ్లేలా చూడాలి, లేనిపక్షంలో పక్క ఇంట్లోకి వెళ్లే ప్రమాదం ఉంటుంది.

దివ్యాంగులకు రూ.6 వేల పింఛన్ ఇవ్వాలి

రాంనగర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగుల 6 వేల పింఛన్ వెంటనే ఇవ్వాలని డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ద డెఫ్ జాతీయ అధ్యక్షుడు వల్లభనేని ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే దివ్యాంగుల పింఛన్‌ను 4016 నుంచి 6 వేలకు పెంచుతామని ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. ఆర్టీసీలో రాష్ట్రమంతంట ఉచిత బస్ ప్రయాణం కల్పించాలన్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి వి.భారతి, ఉపాధ్యక్షులు వెంకటేష్‌గౌడ్, కిరణ్‌కుమార్, ఇమ్రాన్, కిషోర్ పాల్గొన్నారు.

హేతుబద్ధంగా ఉండే కొడవటిగంటి రచనలు

చిక్కడపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కొడవటిగంటి కుటుంబరావు రచనలు హేతుబద్ధంగా ఉంటాయని హాస్యావధాని, ప్రముఖ జర్నలిస్ట్ శంకరనారాయణ అన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో గానసభలో మంగళవారం సాయంత్రం ఎందరో మహానుభావులు శీర్షిక కార్యక్రమంలో భాగంగా కొడవటిగంటి కుటుంబరావు యాదిలో సంస్మరణ సమావేశం గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా శంకరనారాయణ మాట్లాడుతూ.. కుటుంబరావుకు ముందు అభ్యుదయ సాహిత్య ఆలోచనతో రచనలు చేసిన వారు ఉన్నా స్పష్టమైన ప్రగతిశీల దృక్పథంతో సాహిత్యసృష్టి చేసిన కుటుంబరావు అభ్యుదయ సాహిత్య వైతాళికుడుగా పేర్కొనడంలో తప్పులేదన్నారు. కథక్ నాట్యగురువు పండిట్ అంజిబాబు, అభినందన సంస్థ స్థాపకురాలు భవాని పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న శంకరనారాయణ, జనార్దనమూర్తి



మహ్మద్ హర్షద్‌ను అభినందిస్తున్న పులిగారి గోవర్ధన్‌రెడ్డి, సిబ్బంది

తైక్వాండో పోటీల్లో ఇంగ్లిష్ యూనియన్ విద్యార్థి

కవాడిగూడ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అండ్ 17 తైక్వాండో పోటీలలో కవాడిగూడకు చెందిన ఇంగ్లిష్ యూనియన్ విద్యార్థి మహ్మద్ హర్షద్ మొదటి స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ సాధించారు, మలేషియాలో 2023-24కు నిర్వహించిన ఇంటర్నేషనల్ తైక్వాండో పోటీలలో కూడా గోల్డ్ మెడల్ సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ తెలంగాణ న్యాయవాదుల జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరక మంగళవారం తైక్వాండోలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన మహ్మద్ హర్షద్‌ను కవాడిగూడ ఇంగ్లిష్ యూనియన్ పాఠశాలలో అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.స్వర్ణలతారెడ్డి, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సూర్యకాంతం శతజయంతి వేడుకలు

చిక్కడపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): సూర్యకాంతం అంటే గయ్యాళి పాత్రలకు పెట్టింది పేరు. ఆమె మనస్సు మెత్తన. అయినా మూడు దశాబ్దాలు తెలుగు తెరపై గయ్యాళి పాత్రలలో రాణించారు. నగరంలోని షైహోమ్ అవతార్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వారు సూర్యకాంతం జయంతిని కాలనీవాసులతో కలిసి మంగళవారం జరుపుకున్నారు. ప్రముఖ సినీ జర్నలిస్టు ఎస్‌వి రామారావు రూపొందించిన సూర్యకాంతం లఘుచిత్రాన్ని ప్రదర్శించారు. అనంతరం సినీ నటి అన్నపూర్ణమ్మను సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాధాకృష్ణ పాల్గొన్నారు.

సైక్లింగ్‌లో ప్రతిభ చూపిన రత్నిక

చిక్కడపల్లి: సైక్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 26, 27 తేదీల్లో ఢిల్లీలో ఖేలో ఇండియా ఉమెన్స్ లీగ్ ట్రాక్ నేషనల్ పోటీలు జరిగాయి. తెలంగాణ నుంచి రత్నిక పోటీల్లో పాల్గొని జాతీయ స్థాయిలో బ్రాంజ్ మెడల్ సాధించారు.

పోలియో నిర్మూలన కోసం అవగాహన అవసరం

చిక్కడపల్లి: పోలియోరహిత సమాజ నిర్మాణం కోసం ప్రతీ బిడ్డకు టీకా వేయడానికి ప్రజలకు అవగాహన చాలా అవసరమని కిమ్స్ ఆస్పత్రి పీడియాట్రిక్స్ విభాగం చీఫ్ డా.నితిన్‌చావ్లా అన్నారు. మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రొటీన్ ఇమ్యునైజేషన్ ప్రాముఖ్యత గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం వలన పోలియో బారిన పడకుండా బలమైన రక్షణ ఏర్పడుతుందన్నారు. పోలియోపై ప్రజల్లో అవగాహన కల్పించాలని తెలిపారు.

మొదలైన దీపావళి సందడి

● వెలిసిన బొమ్మలు, బాణాసంచా దుకాణాలు ● అమ్మకాలకు సిద్ధమైన మిఠాయిలు



మార్కెట్‌లో విక్రయిస్తున్న బొమ్మలు



బొమ్మలు కొనుగోలు చేస్తున్న మహిళలు

రాంనగర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండగ సందడి ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాలలో రెండు రోజు ముందే మొదలైంది. పండగ సందర్భంగా ఏర్పాటు చేసే బొమ్మల కొలువులకు సంబంధించిన బొమ్మల షాపులు అనేక ప్రాంతాల్లో వెలిశాయి. బొమ్మలను కొనుగోలు చేయడానికి ప్రజలు మార్కెట్లకు పోటెత్తారు. ప్రమీదల షాపులు కూడా వెలిశాయి. ప్రత్యేక ఆకర్షణ గల ప్రమీదలు కొనుగోలు చేయడానికి ప్రజలు ఇష్టపడుతున్నారు. దీంతో ఆయా షాపుల వద్ద సందడి నెలకొంది. పలు చౌరస్తాలు, ఖాళీ ప్రాంతాలలో బాణాసంచా దుకాణాలు వెలిశాయి. యువత, పిల్లలు బాణాసంచా కొనుగోలు చేయడానికి వస్తున్నారు. అదే విధంగా దీపావళి సందర్భంగా మిఠాయి దుకాణదారులు ప్రత్యేక స్వీట్స్ తయారు చేయించి విక్రయిస్తున్నారు. దీపావళి పర్వదినం పురస్కరించుకుని బొమ్మల కొలువులు, స్వీట్ షాపులు, బాణాసంచా దుకాణాలు కొనుగోలుదారులతో సందడిగా మారాయి.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలి: ఎస్‌ఎఫ్‌ఐ



నిరసన తెలుపుతున్న ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థులు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజనీకాంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యాలయంలో హైదరాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఫీజు దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.8 వేల కోట్ల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని కోరారు. తరగతులు మూసివేసి ఆందోళనలు చేస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం నిద్రపోతుందా అని ప్రశ్నించారు. పేద, మధ్య తరగత విద్యార్థులకు అందించే స్కాలర్‌షిప్ విషయంలో ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపిస్తోందని విమర్శించారు. దీక్షకు మద్దతు తెలిపిన డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోటా రమేష్, అనగంటి వెంకటేష్, టీపీటీఎల్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి విజయ్‌కుమార్, డీవైఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి జావిద్ మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ హైదరాబాద్ నగర అధ్యక్ష, కార్యదర్శులు లెనిన్ గువేరా, అశోక్ రెడ్డి, మహిళా విభాగం రాష్ట్ర కన్వీనర్ పూజ, నగర ఉపాధ్యక్షులు రమ్య తదితరులు పాల్గొన్నారు.

సిల్ట్ వెహికల్ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తా



ఎమ్మెల్యేకు సమస్యలు తెలుపుతున్న శ్రీనివాస్ తదితరులు

ముషీరాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): డ్రైనేజీ మ్యాన్‌హోల్స్‌లో మట్టిని తరలించే వాహనకార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. మంగళవారం ముషీరాబాద్‌కు చెందిన తెలంగాణ దళిత సిల్ట్ వెహికిల్ యూనియన్ అసోసియేషన్ అధ్యక్షుడు మామిడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిసి తమ సమస్యలను వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కార్మికుల సమస్యలను జలమండలి ఎండీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అన్నారు. దళితబంధు ద్వారా సిల్ట్‌ను తరలించే వాహనాలను పొందిన కార్మికులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, రాంచందర్, కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీనివాస్, సభ్యులు నర్సింగ్‌రావు, సుబ్రహ్మణ్యం, శ్రీకాంత్, రాము పాల్గొన్నారు.

అంబర్‌పేట డివిజన్‌లో నీటి సమస్యను పరిష్కరించాలి



వాటర్‌వర్క్స్ డీజీఎంతో మాట్లాడుతున్న కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ తదితరులు

అంబర్‌పేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట డివిజన్‌లో తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ జలమండలి డీజీఎంకు విజ్ఞప్తి చేశారు. డివిజన్‌లోని పలు బస్తీలలో లోప్రెషర్, కలుషిత నీటి సమస్యలపై స్థానికులు కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మంగళవారం కార్పొరేటర్ జలమండలి డీజీఎంను కార్యాలయంలో కలిసి సమస్యను వివరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రంగు సతీష్‌గౌడ్, మహేష్ ముదిరాజ్, సంతోష్‌చారి పాల్గొన్నారు.

'సింగరేణి తరహాలో బోనస్ ఇవ్వండి'

హైదరాబాద్ సిటీ: సింగరేణి ఉద్యోగులకు ప్రభుత్వం ఇస్తున్న దసరా, దీపావళి బోనస్‌ల మాదిరిగా ఇతర ప్రభుత్వ సంస్థల్లో పని చేసేవారికి కూడా బోనస్ ఇవ్వాలని ఉద్యోగ సంఘాల సమాఖ్య కోరింది. బషీర్‌బాగ్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో సంఘాల ప్రతినిధులు ఈ నిర్ణయం తీసుకున్నారు. అనంతరం తెలంగాణ ప్రభుత్వరంగ ఉద్యోగుల సమాఖ్య చైర్మన్ బాలకిషన్, ప్రధాన కార్యదర్శి టీజీ జీవన్‌లు సీఎం పేషీలో వినతిపత్రాన్ని అందించారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

ముషీరాబాద్ సీఐ రాంబాబు



సీఐ రాంబాబు, ఎస్సై ప్రసాద్‌రెడ్డిని సన్మానించిన బీఆర్ఎస్ నేతలు

ముషీరాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): సామాజిక బాధ్యతతో నేరాల అదుపునకు ప్రతి ఒక్కరూ తమ ప్రాంతాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ముషీరాబాద్ సీఐ రాంబాబు సూచించారు. భోలక్‌పూర్‌కు చెందిన మూడేళ్ల బాలుడు తాజ్ అహ్మద్ కిడ్నాప్‌కు గురికావడంతో తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ముషీరాబాద్ పోలీసులు సకాలంలో స్పందించి 8 గంటల్లో బాలుడి ఆచూకీ కనుగొన్నారని తెలిపారు. ముషీరాబాద్ పోలీసులను అభినందిస్తూ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు అక్లక్ హుస్సేన్ ఆధ్వర్యంలో మంగళవారం ముషీరాబాద్ సీఐ రాంబాబు, ఎస్సై ప్రసాద్‌రెడ్డితో పాటు కానిస్టేబుళ్లను సన్మానించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ... సీసీ ఫుటేజీల ఆధారంగానే కిడ్నాప్‌నకు గురైన బాలుడిని గుర్తించి వారి తల్లిదండ్రులకు అందజేశామన్నారు. ముషీరాబాద్ పోలీసులు బృందాలుగా ఏర్పడి స్థానికంగా ఉన్న సీసీ ఫుటేజీలను పరిశీలించి బాలుడిని గుర్తించాము అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అబ్దుల్, రహీం, కానిస్టేబుళ్లు మహేష్, సాయికుమార్, ప్రకాష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

హైటెన్షన్ వైరు తగిలి బాలుడికి తీవ్రగాయాలు

అంబర్‌పేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండగను పురస్కరించుకుని ఇంటిపై లైటింగ్ ఏర్పాటు చేస్తున్న ఓ బాలుడిని ఇంటి పై నుంచి వెళ్తున్న హైటెన్షన్ వైరు తగలడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. సీఐ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం. ఉప్పుగూడ లలితాబాగ్‌కు చెందిన రమేష్ కుమారుడు అభిలాష్(18) లైటింగ్ డెకరేషన్ పనులు చేస్తాడు. మంగళవారం సాయంత్రం అలీకేఫ్ చౌరస్తాలోని శివానగర్ హోటల్‌పై దీపావళి పండగ సందర్భంగా లైటింగ్ డెకరేషన్ పనిచేయడానికి వచ్చాడు. అక్కడ హోటల్‌పై నుంచి వెళ్లే విద్యుత్ హైటెన్షన్ వైరు ఆ బాలుడిని లాగేసింది. ఈ ఘటనలో అతడికి కరెంట్ షాక్ తగిలి శరీరం పూర్తిగా కాలిపోయింది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని బాలుడిని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. బాలుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'బెటాలియన్ పోలీసులకు న్యాయం చేయాలి'

నల్లకుంట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బెటాలియన్ పోలీసులు చేస్తున్న ఆందోళన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వెంటనే వారికి న్యాయం చేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు డిమాండ్ చేశారు. మంగళవారం విద్యానగర్‌లోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బెటాలియన్ పోలీసులతో పోలీసు వృత్తి బదులు ఇంటి పనులు, గడ్డి తీయడాలు చేయించడాన్ని వ్యతిరేకిస్తూ వన్ పోలీస్ వన్ స్టేట్ అనే నినాదంతో చేపట్టిన వారికి, కుటుంబ సభ్యులకు సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ సంపూర్ణ మద్దతు తెలిపారు. పోలీసు వ్యవస్థలో ఉన్న మాదిరిగానే సెలవులు, పని, ట్రాన్స్‌ఫర్స్ విధానంపై ఆందోళన చేస్తున్న వారిని అరెస్ట్ చేయడం, కొంత మందిని సస్పెండ్ చేయడం అన్యాయమన్నారు.

పేదలకు స్వచ్ఛంద సంస్థలు సాయం చేయాలి

కవాడిగూడ: నిరుపేదలను ఆదుకునేందుకు ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సేవా సంస్థలు ముందుకు రావాలని భారత్ సేవాశ్రమ్ హైదారాబాద్ నగర కార్యదర్శి వెంకటేశ్వరానంద స్వామి పిలుపునిచ్చారు. దీపావళి పండగను పురస్కరించుకొని భారత్ సేవాశ్రమ్ ఆధ్వర్యంలో ఇందిరాపార్కులో పనిచేసే మునిసిపల్ కార్మికులు, కూలీలకు చీరలు, దుస్తులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్వామి వేంకటేశ్వరానంద ముఖ్యఅతిథిగా హాజరై కూలీలకు చీరలు, దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేదలను ఆదుకునేందుకు ఆశ్రమ పక్షాన సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఇందిరాపార్కు అధికారులు, సిబ్బంది, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



మునిసిపల్ సిబ్బంది, కూలీలకు చీరలు పంపిణీ చేస్తున్న వెంకటేశ్వరానంద తదితరులు

బాగ్‌అంబర్‌పేటలో చెత్తను తరలించాలి



చెత్తను తరలిస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది

నల్లకుంట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని మోహిన్ చెరువు శ్మశానవాటికలో పేరుకుపోయిన చెత్త, మట్టికుప్పలను తరలించి శుభ్రం చేయాలని కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి జీహెచ్ఎంసీ పారిశుధ్య కార్మికులకు సూచించారు. మంగళవారం డివిజన్‌లోని మోహిన్ చెరువు శ్మశానవాటికతో పాటు పరిసర ప్రాంతాలలో పారిశుధ్య సిబ్బంది తరలిస్తున్న చెత్తను ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బి.వెంకటరెడ్డి, మిరియాల శ్రీనివాస్, శ్మశానవాటిక ప్రభందక కమిటీ సభ్యులు నూతకంటి శ్రీహరి, జంగయ్య, జీహెచ్ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి నాయక్, సూపర్‌వైజర్ సుధాకర్, మహమ్మద్ ఆదిల్ తదితరులు పాల్గొన్నారు.

మ్యారేజీ బ్యూరోలను ప్రభుత్వం గుర్తించాలి



మ్యారేజీ సభ్యులకు ఐడీ కార్డులు పంపిణీ చేస్తున్న గడ్డమీది రాధాహరినాథ్‌గౌడ్

రాంనగర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మ్యారేజీబ్యూరోలను ప్రభుత్వం గుర్తించి కార్డులు జారీ చేసి ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని గౌడ మ్యారేజీ బ్యూరో మీడియేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గడ్డమీది రాధాహరినాథ్‌గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో గౌడ మ్యారేజ్ బ్యూరో మీడియేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మ్యారేజీ బ్యూరో సభ్యులకు ఉచితంగా ఐడీ కార్డులు, సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గడ్డమీది రాధాహరినాథ్‌గౌడ్ మాట్లాడుతూ మ్యారేజీ బ్యూరో సభ్యులకు ఉచిత బస్‌పాస్, డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆలిండియా జేఏసీ చైర్మన్ బి.ఎం.అర్జున్‌రావు మాట్లాడుతూ మ్యారేజీ బ్యూరోలను ప్రభుత్వం గుర్తించాలని కోరారు.



ముషీరాబాద్ తహసీల్దార్‌తో మాట్లాడుతున్న బీజేపీ నేత వినయ్, బాధితులు

'వివేకానందనగర్ వాసులకు ఇళ్లు కేటాయించాలి'

చిక్కడపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానందనగర్ బస్తీవాసులకు ఇళ్ల కేటాయింపు ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్ తహసీల్దార్ రాణాప్రతాప్‌సింగ్‌ను కోరారు. గాంధీనగర్ డివిజన్ స్వామివివేకానందనగర్‌లో నివాసం ఉంటున్న వారి ఇళ్లను గత జనవరి 29న రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారుల పర్యవేక్షణలో కూల్చిన నేపథ్యంలో సోమవారం మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన వారు మంగళవారం ముషీరాబాద్ తహసీల్దార్‌ను కలిశారు. కూల్చివేతలు జరిగి 10 నెలలు గడిచిపోయినా వారికి పునరావాసం కల్పించలేదని ఇందుకు సంబంధించిన ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని తహసీల్దార్‌ను బీజేపీ నేత, బాధితులు కోరారు. తహసీల్దార్‌ను కలిసినవారిలో బస్తీబాధితులు ఎంబి కృష్ణ జ్ఞానేశ్వర్, ఆనంద్‌రావు తదితరులున్నారు.

దీక్షతో ఉన్నత స్థాయికి ఎదగాలి

ఓయూ బిజినెస్ మేనేజ్‌మెంట్ హెచ్ఓడీ ప్రొఫెసర్ వై.జహంగీర్



కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న అవంతి విద్యా సంస్థల చైర్మన్ శ్రీనివాస్‌రావు

బర్కత్‌పుర, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రతీ విద్యార్థి కార్యసాధన దీక్షతో ముందుకు సాగినప్పుడే ఉన్నతస్థాయికి ఎదగవచ్చని ఉస్మానియా యూనివర్సిటీ బిజినెస్ మేనేజ్‌మెంట్ హెచ్ఓడీ ప్రొఫెసర్ వై.జహంగీర్ అన్నారు. సాంకేతిక నైపుణ్యం కలిగి తమ లక్ష్యాలను సాధించుకోవాలని, ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనే సామర్థ్యం ఉండాలని సూచించారు. మంగళవారం నారాయణగూడ తాజ్‌మహల్ హోటల్‌లో అవంతి డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో సైనోరా - 24 కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ప్రతీ విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సి.మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. అవంతి విద్యా సంస్థల చైర్మన్ ఎం.శ్రీనివాస్‌రావు మాట్లాడారు. కార్యక్రమంలో అవంతి విద్యా సంస్థల అధ్యక్షురాలు ఎం.జ్ఞానేశ్వరి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎం.ప్రియాంక, మేనేజింగ్ డైరెక్టర్ శ్రవణ్‌కుమార్, ఉపాధ్యక్షులు ఎం.బి.ఎస్. ఎస్.నందేష్, తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడుగా దివ్యాంగుల సంస్థ మాజీ చైర్మన్ పి.సాయిబాబా రెండోసారి నియమితులైన సందర్భంగా నగర ప్రధాన కార్యదర్శులు నల్లెల కిషోర్, బాల్‌రాజ్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో పి.సాయిబాబాను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. రవీంద్రచారి, నాగునగేష్, ప్రకాష్, భిక్షపతిచారి, విఠల్ పాల్గొన్నారు. - రాంనగర్

ఈ కాలపు జాషువా సతీష్‌చందర్

తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ అధ్యక్షుడు జూలూరు గౌరీశంకర్

సతీష్‌చందర్ రాసిన 'బృహన్నలపేట' నవల ఆవిష్కరణ



నవల ఆవిష్కరణ సభలో సన్నిధానం నరసింహశర్మ, జూలూరు గౌరీశంకర్, కుప్పిలి పద్మ తదితరులు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తెలుగు సాహిత్యంలో అన్ని ప్రక్రియల్లో విస్తృతంగా రచనలు చేస్తున్న నిరంతర సాహితీ సేద్యకారుడు సతీష్‌చందర్ అని తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ అధ్యక్షుడు జూలూరు గౌరీశంకర్ కొనియాడారు. ఆయన్న సమాజాన్ని అట్టడుగు పొరల నుంచి అన్ని కోణాల్లోనూ విశ్లేషిస్తూ రచనలు చేస్తున్న ఈ కాలం జాషువాగా అభివర్ణించారు. సీనియర్ జర్నలిస్టు సతీష్‌చందర్ రాసిన 'బృహన్నలపేట' నవలను మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రముఖ రచయిత సన్నిధానం నరసింహ శర్మ ఆవిష్కరించారు. సభాధ్యక్షత వహించిన జూలూరు గౌరీశంకర్ మాట్లాడుతూ సమాజానికి పట్టిన మకిలిని తన అక్షరాలతో సతీష్‌చందర్ శుద్ధి చేస్తున్నాడంటూ శ్లాఘించారు. సన్నిధానం నరసింహశర్మ మాట్లాడుతూ వాక్యాన్ని వ్యంగ్యాత్మకం చేసి అందులో కసిని, కోపాన్ని, బాధను, కన్నీటిని, కష్టాలను ప్రదర్శించగల నేర్పరితనం సతీష్‌చందర్ సొంతమని ప్రశంసించారు. సామాజిక దుర్మార్గాలపై సంధించిన అస్త్రం ఈ నవల అని అభివర్ణించారు. 'బృహన్నలపేట' నవల పాఠకులను ఆలోచింపచేస్తుందని ప్రముఖ స్త్రీవాద రచయిత్రి కుప్పిలి పద్మ అన్నారు. కార్యక్రమంలో ఏపీ జర్నలిజం కళాశాల కరస్పాండెంట్ గౌరీచందర్, అధ్యాపకుడు స్రవంత్ పాల్గొన్నారు.



మంత్రి ప్రభాకర్‌ను సన్మానించిన ఎస్తేర్‌రాణి

కాంగ్రెస్ మహిళా నేతలకు నామినేటెడ్ పోస్టులు ఇవ్వాలి

చిక్కడపల్లి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ మహిళా నేతలకు నామినేటెడ్ పోస్టులు ఇవ్వాలని కోరుతూ రాష్ట్ర కాంగ్రెస్ మహిళా ప్రధాన కార్యదర్శి ఎస్తేర్‌రాణి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సచివాలయంలో నగర ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి సన్మానించి ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి మహిళా కాంగ్రెస్ నేతలు కూడా ఎంతో కృషి చేశారన్నారు. మంత్రి హామీ ఇచ్చారని ఆమె వివరించారు.



శేష్‌నారాయణ్‌ను సన్మానిస్తున్న వివేకానంద్

ఎఫ్ఎంసీ నూతన చైర్మన్‌కు సన్మానం

చిక్కడపల్లి: ఫతేమైదాన్ క్లబ్ నూతన చైర్మన్‌గా ఎన్నికైన సందర్భంగా ప్రముఖ వ్యాపారి, కాంగ్రెస్ నాయకుడు శేష్‌నారాయణ్‌ను సోమవారం ఘనంగా సన్మానించారు. స్వచ్ఛందసంస్థ నిర్వాహకులు వివేకానంద్ ఈసందర్భంగా శేష్‌నారాయణ్‌ను సన్మానించారు. శేష్‌నారాయణ్ మాట్లాడుతూ ఫతేమైదాన్ క్లబ్ సభ్యులకు విలువైన సేవలు అందిస్తామన్నారు. అదేవిధంగా ఎఫ్ఎంసీ పక్షాన సాంఘిక సేవా కార్యక్రమాలు చేయడానికి కూడా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వివరించారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి

అంబర్‌పేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట డివిజన్ ఆకాశ్‌నగర్‌లో రెండు నెలలుగా స్థానికులు ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని ఎంఐఎం నాయకుడు మహమ్మద్ సమీవుల్లా అధికారులను కోరారు. దాదాపు రెండు నెలల క్రితం మురుగునీటి సమస్యపై అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ వారు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన అంబర్‌పేటలో విలేకరులతో మాట్లాడుతూ జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులు ఆకాశ్‌నగర్ సందర్శించి మురుగునీటి సమస్య పరిష్కరిస్తామని చెప్పి నెలలు గడచిన ఇంత వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. అధికారులు వెంటనే ఈ సమస్యపై స్పందించి మురుగు పరిష్కరించాలని ఆయన కోరారు.



అమ్మవారి చీరలను వేళం వేసిన ఈఓ

మహంకాళి అమ్మవారి చీరల వేలం

ముషీరాబాద్: ముషీరాబాద్‌లో ప్రసిద్ధిగాంచిన మహంకాళి దేవాలయ అమ్మవారి చీరలను మంగళవారం ఆలయ ప్రాంగణంలో వేలం వేశారు. దేవాదాయ శాఖ ఈవో మహేందర్‌కుమార్ పర్యవేక్షణలో కొనసాగిన వేళం పాటలో ఆలయ ప్రధాన అర్చకులు చంద్రమౌళి, రాము, ఎయిర్‌టెల్ రాజు పాల్గొన్నారు.